సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రమైంది. శనివారం, దసరా సెలవులు ముగియడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. 8లో ▸



వేద నిలయం.. ఇరగవరం

నిత్య వేదఘోషతో వేద నిలయంగా పేరొందింది పశ్చిమగోదావరి జిల్లాలో ఇరగవరం గ్రామం. ఇక్కడి ఘనాపాఠీలు దేశవ్యాప్తంగా ఖ్యాతి పొందారు. 8లో ▸



హత్య కేసులో ఆరుగురి అరెస్ట్

తణుకులో తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడి అదృశ్యం ఆపై హత్య కేసును ఛేదించిన పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

7న ఉపాధ్యాయుల 'చలో విజయవాడ'



ఉపాధ్యాయులను కలిసిన ఫ్యాప్టో నాయకులు

భీమవరం: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న చేపట్టిన చలో విజయవాడ పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పీఎస్ విజయరామరాజు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ పాఠశాలల్లో కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ జి.ప్రకాశంతో కలిసి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చలో విజయవాడ పోరుబాట కార్యక్రమం చేపట్టామన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఉపాధ్యాయులకు పంపిణీ చేసి ధర్నాకు హాజరుకావాలని కోరామన్నారు. ఫ్యాప్టో నాయకులు మల్లేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులను ఆకర్షించాలి



జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పరిశ్రమలు, టూరిజం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆక్వా రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పెట్టుబడుల సమన్వయ సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఊక నుంచి రైస్‌బ్రాన్ ఆయిల్, సిలికాన్ జెల్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో చిన్నపాటి పరికరాల తయారీపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 19 కిలోమీటర్ల మేర గోదావరి తీర ప్రాంతంలో (అయోధ్యలంక నుంచి నరసాపురం వరకూ) రిసార్ట్స్, కాటేజీల ఏర్పాటుపై పరిశీలించాలన్నారు. లేసు ఉత్పత్తులు ప్రోత్సహించేలా, పెట్టుబడులు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావును ఆదేశించారు. వ్యవసాయ క్షేత్రాల్లో కాటేజీలు, ఓపెన్ రిసార్ట్స్ నెలకొల్పేలా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించాలని సూచించారు. డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, డీపీఓ ఎం.రామనాథరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, ఎల్‌డీఎం ఎ.నాగేంద్రప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా చేనేత శాఖాధికారి కె.అప్పారావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ విజేత శ్రీకాకుళం

పురుషుల విజేత తూర్పుగోదావరి



మహిళల విజేత శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 73వ అఖిలభారత పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. మహిళల కబడ్డీ విజేతగా శ్రీకాకుళం జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్ శ్రీకాకుళం-చిత్తూరు జట్ల మధ్య జరగ్గా చిత్తూరు జట్టుపై 40-29 స్కోర్‌తో శ్రీకాకుళం జట్టు గెలుపొందింది. చిత్తూరు జట్టు ద్వితీయస్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల ఫైనల్ మ్యాచ్ గుంటూరు-తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగింది. తూర్పుగోదావరి జట్టు 59-39 స్కోర్ తేడాతో గుంటూరు జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. విజేతలకు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నగదు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు.

ఆటలకు నిలయం నూజివీడు: మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నూజివీడులో పూర్వకాలం నుంచి ఆటలకు గొప్ప పేరుందని అన్నారు. ఆటలు, క్రీడలకు నూజివీడులో లభించే ప్రోత్సాహం జిల్లాలో మరెక్కడా లభించదన్నారు. ప్రతిఒక్కరూ క్రీడలను ప్రోత్సాహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు ఆటల గురించి తెలియజేయడంతో పాటు ఆడుకునేలా అవకాశం కల్పించాలన్నారు. క్రీడల్లో ప్రతిభను కనబరిస్తే నలుదిశలా పేరు ప్రఖ్యాతలు లభిస్తాయన్నారు. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు రామిశెట్టి మురళీకృష్ణ, సెక్రటరీ టీవీ కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ మల్లెపూడి రాజశేఖర్, జడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కోటగిరి సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేవీ డిపోపై పోరుబాట

- గిరిజనులు వ్యతిరేకిస్తున్నా దూకుడుగా సర్కారు యత్నాలు
- గ్రామసభల్లో వ్యతిరేక తీర్మానం చేసినా ముందుకు..
- మండల పరిషత్‌లో తీర్మానం చేసేలా స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిళ్లు
- పొగాకు సహా మంచి పంటలు పండే భూమి సేకరణకు యత్నం
- నేవీ డిపోపై తీవ్రమైన తిరుగుబాటు



జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో గిరిజన రైతుల ఆయిల్‌పామ్ తోట



వంకావారిగూడెంలో తన భూమిలోని వేరుశనగ పంటను చూపిస్తున్న రైతు మడకం శేషారావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా గిరిపల్లెల్లో నేవీ డిపో ఏర్పాటుపై నిప్పు రాజుకుంది. గిరిజనులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ గ్రామసభలో వ్యతిరేక తీర్మానాలు చేసినా సర్కారు దూకుడు కొనసాగిస్తూనే ఉంది. ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ప్రత్యేక ఆసక్తితో పల్లెలు వ్యతిరేకిస్తున్నా ప్రాజెక్టు ఏర్పాటుకు చకచకా ముందుకు సాగడంపై తీవ్ర నిరసనలు కొనసాగుతున్నాయి. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో డిపో ఏర్పాటును నిరసిస్తూ మూడుసార్లు గ్రామసభలు డిపో వద్దంటూ తీర్మానం చేసినప్పటికీ అక్కడే డిపో పెడతామని ముందుకు సాగడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. 1,166 ఎకరాల నాణ్యమైన సాగు భూమిని సేకరించడానికి వీలుగా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో దాట్లగూడెం, రమణక్కపేట, మడకంవారిగూడెం, వంకావారిగూడెం, తదితర గ్రామాల పరిధిలో 1,166 ఎకరాలు సేకరిస్తున్నారు. భూ సేకరణకు, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మూడుసార్లు గ్రామసభలు నిర్వహించి వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. అయినా సర్కారు హడావుడి కొనసాగుతుండటంతో నిరసన ర్యాలీ, ఆందోళనలు గిరిజన సంఘాలు నిర్వహించిన క్రమంలో సెక్షన్-30తో అడ్డుకునే ప్రయత్నం చేశారు. తాజాగా గ్రామసభలు, పంచాయతీ తీర్మానాలతో నిమిత్తం లేకుండా స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మండల పరిషత్‌లో తీర్మానం చేయించే దిశగా ముందుకు సాగుతున్నారు. భూసేకరణకు సిద్ధం చేసిన భూముల్లో ప్రస్తుతం వేరుశనగ, వర్జీనియా పొగాకు, ఆయిల్‌పామ్ వంటి పంటలు పండే నాణ్యమైన భూములున్నాయి. ఆ భూముల్లోనే పని చేసుకుంటూ ఆయా గ్రామాల గిరిజన ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ భూములను డిపో ఏర్పాటుకు సేకరిస్తే తమ జీవనం కష్టతరంగా మారుతుందని, తాము డిపోను వ్యతిరేకిస్తున్నామని గిరిజనులు చెబుతున్నారు.

సాగు భూములను ఇవ్వం



వంకావారిగూడెం పరిసర ప్రాంతాల్లో సాగు భూములు ఎక్కువగా ఉన్నాయి. పత్తి, వేరుశెనగ, ఆయిల్‌పామ్ వంటి పంటలు పండించుకుంటున్నాం. ఆ భూములను ప్రభుత్వం తీసుకోవాలని చూస్తే ఊరుకోం. ఆ భూములే మాకు జీవనాధారం. నేవీ డిపో ఏర్పాటును మేం వ్యతిరేకిస్తున్నాం. మా అభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించాలి.

– తెల్లం సోమరాజు, రైతు, వంకావారిగూడెం

భూములు పోయే పరిస్థితి



నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. వరి, వేరుశనగ పండిస్తూ జీవనం సాగిస్తున్నాను. మా భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నం అధికారులు, పాలకులు చేస్తున్నారు. దీని వల్ల తీవ్రంగా నష్టపోతాం. మా భూములు తీసుకుంటే పూర్తిగా జీవనాధారం కోల్పోతాం. మా నిర్ణయాన్ని గౌరవించకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధం.

– బుద్దుల తులసమ్మ, రైతు, వంకావారిగూడెం

ఎంపీపై గిరిజనుల ఆగ్రహం

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు జీలుగుమిల్లి మండల వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో రమణక్కపేట, మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, కొత్తచీమలవారిగూడెం గ్రామాల్లో మొత్తం 1,166 ఎకరాల్లో భూములు సేకరించాలని అధికారులు ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అయితే పంట భూములను ఇచ్చేది లేదని గిరిజనులు తెగేసి చెబుతున్నారు. అయినా డిపో ఏర్పాటుపై ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మొండిగా ముందుకు సాగుతున్నారని గిరిజనులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేసుకునే తమ భూములు కాకుండా అదే మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆనుకుని ఉన్న బర్రింకలపాడు అటవీ భూముల్లో గానీ, వేరే ప్రాంతాల్లో కానీ పెట్టుకోవాలని ఇక్కడి గిరిజన ప్రజలు సూచిస్తున్నారు. తాము వద్దంటున్నా ఎంపీ పుట్టా మహేష్ పట్టుబట్టడం పట్ల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

గిరిజనులు వద్దంటున్నా.. రాజకీయ ఒత్తిళ్లు

నేవీ డిపో ఏర్పాటుకు గ్రామసభల తీర్మానం లేకుండా ప్రభుత్వం యత్నాలు చేస్తుందని గిరిజనులు మండిపడుతున్నారు. ఇప్పటివరకూ మూడుసార్లు వ్యతిరేకంగా 5 గ్రామాల గిరిజనులు తీర్మానం చేశారు. అంతేకాకుండా పెద్ద ఎత్తున ఆందోళన సైతం కొనసాగించారు. అయినా బలవంతంగా నేవీ డిపోను వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోనే ఏర్పాటు చేయాలని మొండిగా ముందుకు సాగుతుందని గిరిజనులు మండిపడుతున్నారు. 5 గ్రామాల ప్రజలు గ్రామ సభల్లో డిపోకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మండల పరిషత్‌లో ఎంపీటీసీలతో అనుకూలంగా తీర్మానం చేసి ముందుకు సాగాలనే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. నేవీ డిపోకు అనుకూలంగా సంతకాలు చేయాలని రాజకీయ నాయకులు ఎంపీటీసీలకు ఫోన్‌లు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. నిబంధలకు విరుద్ధంగా ముందుకు సాగితే తీవ్ర ప్రతిఘటనలు తప్పవని వంకావారిగూడెం ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఈ-శ్రమ్‌తో కార్మికులకు ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

పెదవేగి: అసంఘటిత కార్మికులు తమ వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలను పొందవచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శనివారం ఆయన పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలు, ఉచిత న్యాయ సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా పథకాలను పొందవచ్చని, కార్మికులు పని చేస్తున్న ప్రదేశాల్లో లేదా సంస్థల్లో ఎదురయ్యే లైంగిక సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని సూచించారు. ఏలూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి స్పందన, పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పీవీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య, తణుకు రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.కృష్ణవేణి, నిడదవోలు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ ఖవాజా రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నాగరాజు వెంకట శ్రీనివాసరాజు (భీమవరం), రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా ఇర్రింకి కాశీ విశ్వనాథం (పాలకొల్లు), రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ సెక్రటరీగా గూడూరి ఓంకార్ (భీమవరం), రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ సెక్రటరీగా గుంటి ప్రభాకర్ (ప్రభు) (భీమవరం) నియమితులయ్యారు.

దేదీప్యం.. దివ్య తేజం



సూర్యప్రభ వాహనంపై శ్రీవారి సేవ

- సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు
- సరస్వతీదేవి అలంకరణలో దర్శనం
- మూడో రోజుకు చేరిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: చైతన్యమూర్తినే వాహనంగా మలచుకుని విహరించిన కలియుగ వైకుంఠ వాసుడిని వీక్షించిన భక్తజనులు పులకించారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యుడు తేజోనిధి.. సకల రోగాలను నివారిస్తాడు. అందుకే వాహన సేవల్లో ఈ వాహనానికి అత్యంత ప్రాధాన్యం. తొలుత ఆలయంలో పంచాయుధాలను ధరించి నారాయణమూర్తి అలంకరణలో సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో ఊరేగిన శ్రీవారికి భక్తులు నీరాజనాలు అర్పించారు. సూర్యప్రభ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శిస్తే సకల విద్య, ఆరోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు తెలిపారు. ఇదిలా ఉండగా రాత్రి జరగాల్సిన చంద్రప్రభ వాహన సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

చదువుల తల్లిగా శ్రీవారు : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారు ఆలయ ముఖ మండపంలో చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకారంలోని స్వామిని దర్శిస్తే ఇతి బాధలు ఉండవని, విద్య అపారంగా కలుగుతుందని పండితులు చెబుతున్నారు.



సరస్వతీదేవి అలంకారంలో శ్రీవారు



బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 10 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం వెండి శేషవాహనంపై గ్రామోత్సవం
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : భూ వరాహ స్వామి

అరకొర బస్సులు.. ప్రయాణికుల పాట్లు

- గొడవలు, తోపులాటలతో పోలీసుల రంగప్రవేశం
- రాత్రి వరకూ కొనసాగిన రద్దీ



ద్వారకాతిరుమల బస్టాండ్‌లో తాడేపల్లిగూడెం బస్సు వద్ద తోపులాట



ప్రయాణికులను అదుపు చేస్తున్న ఎస్సై సుధీర్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు బస్సు ప్రయాణం.. ప్రహసనంగా మారింది. శనివారం క్షేత్రానికి వేలాది మంది భక్తులు విచ్చేశారు. తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే బస్సులు అరకొరగా ఉండటంతో బస్సులు ఎక్కేందుకు పోటీపడ్డారు. దీంతో గొడవలు, కేకలతో బస్టాండ్ ప్రాంతం దద్దరిల్లింది. బస్టాండ్‌లోకి వస్తున్న బస్సులకు ఎదురెళ్లి ఎక్కుతుండటంతో దిగేవారు నానా అవస్థలు పడ్డారు. డ్రైవర్లు, కండక్టర్లు వారిస్తున్నా వినకుండా పలువురు ఫుట్‌బోర్డులపై నిలిచి మరీ ప్రమాదకర ప్రయాణాలు సాగించారు. చాలీచాలని బస్సులు, యాత్రికుల గొడవలతో స్థానిక ఎస్సై టి.సుధీర్ సిబ్బందితో కలిసి బస్టాండ్‌కు చేరుకుని ప్రయాణికులను నియంత్రించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కొనసాగింది. అయితే కొందరు భక్తులు బస్సులు ఎక్కలేమంటూ ఆటోలు ఎక్కి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ప్రభుత్వ నిర్వాకం కారణంగా పోలీసులు బస్టాండుల్లో బస్సుల వద్ద విధులు నిర్వర్తించాల్సి వస్తోందని, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు భయపడాల్సి వస్తోందని పలువురు వాపోయారు. అయినా యాత్రికులకు సురక్షితమైన ప్రయాణం లేదని పలువురు అంటున్నారు.

బాలిక అప్పగింత



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పేరుపాలెం బీచ్‌లో తప్పిపోయిన బాలికను మొగల్తూరు పోలీసులు గంట వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు శనివారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరానికి చెందిన ఓ కుటుంబం తమ ఎనిమిదేళ్ల బాలిక తప్పిపోయిందంటూ సాయంత్రం 4 గంటలకు బీచ్ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన అవుట్ పోస్ట్ పోలీసులు బాలిక ఆచూకీ గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసుల కృషిని ఎస్పీ అభినందించారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల మరింత శ్రద్ధ వహించాలని, తక్షణ సహాయం కోసం పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పేదల బియ్యం పక్కదారి

- రేషన్ డీలర్లే కొనుగోలు
- షాపుల్లోనే నిల్వలు.. రాత్రిళ్లు తరలింపు



రేషన్ షాపులో సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలు

లింగపాలెం: 'కంచే చేను మేసిన' చందంగా రేషన్ డీలర్లే పేదలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కార్డుదారుల నుంచి నేరుగా కొనుగోలు చేసి రేషన్ షాపుల్లోనే నిల్వ ఉంచుతూ, రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ బియ్యం వ్యాపారులకు ఎగుమతి చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ముఖ్యంగా లింగపాలెం మండలంలో కొందరు డీలర్లు పోటీపడి మరీ కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. బియ్యం కోసం రేషన్ షాపులకు వస్తున్న కార్డుదారులకు కిలోకు రూ.15 చొప్పున చెల్లిస్తున్నారు. బియ్యం కావాలా, డబ్బులు కావాలా అని అడుగుతుండటంతో కార్డుదారులు ఆశ్చర్యపోతున్నారు. గతంలో చాటుమాటున జరిగే ఈ వ్యవహారం కూటమి ప్రభుత్వ పాలనలో బహిరంగంగానే జరుగుతోంది. లింగపాలెం మండలంలో నెలకు సుమారు 600 టన్నుల వరకూ ఇలా సేకరించడం, రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపులేకపోవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లింగపాలెం, చింతలపూడి మండలాల్లో సుమారు 47 వేలకు పైగా బియ్యం కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెలా బియ్యం కోసం ప్రభుత్వం రూ.9 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. ప్రధానంగా రేషన్ బియ్యం వ్యాపారానికి డీలర్లు సహకరిస్తున్నారని, అయినా అధికారులు తనిఖీలు, చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు పంపిణీ

భీమవరం: ఆటో డ్రైవర్లకు సాయం పంపిణీకి సంబంధించి నమూనా చెక్కును కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8,489 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.12.73 కోట్లు జమ చేయనున్నట్టు చెప్పారు. భీమవరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ నాగరాణి లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూనకం మునియ్య

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలో పారిశుద్ధ్య కార్మికుడిగా ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పూనకం మునియ్య కలుపు మందు తాగి శని వారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వార్డు శానిటరీ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనను వేధిస్తున్నారని వారి వేధింపులు తాళలేక ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డానని బాధితుడు తెలిపాడు. మునియ్య పరిస్థితి విషమంగా ఉం దని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



బొమ్ములూరు వద్ద ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

పెదపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొనడం తో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలైన సంఘటన కలపర్రు టోల్‌గేట్ సమీ పంలోని బాపులపాడు మండలం బొమ్ములూ రులో పరిధిలో చోటు చేసుకుంది. బాపుల పాడు హనుమాన్ జంక్షన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుంచి విజయ వాడకు ఆటోలో 8 మంది బయలు దేరారు. కలపర్రు టోల్ గేట్ దాటి కృష్ణా జిల్లా బాపు లపాడు మండలం బొమ్ములూరు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిం ది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలు కాగా, మరో వ్యక్తికి తీవ్రగా యాలయ్యాయి. దీంతో వారిని ఏలూరు ప్రభు త్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

వేద నిలయం.. ఇరగవరం

- పాలేశ్వరుడు కొలువైన గ్రామం
- వేదపండితులు, ఘనాపాఠీలు, సిద్ధాంతులకు ప్రసిద్ధి
- ప్రముఖ ఆలయాల్లోని వేదపండితుల్లో పలువురు ఈ గ్రామ మూలాలు ఉన్నవారే

వేదః శివః శివో వేదః
వేదాధ్యాయి సదా శివః

వేదమే శివుడు. శివుడే వేదం. ఈశ్వరుని ఉచ్ఛ్వాస, నిశ్వాసాలే వేదాలుగా చెబుతారు. ఆ పరమేశ్వరుడే స్వయంభువుగా వెలసి పాలే శ్వరునిగా పూజలందుకుంటున్న గ్రామం. యజ్ఞయాగాదులు, నిత్య వేదఘోషతో వేద నిలయంగా పేరొందింది పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం. గ్రామం నుంచి వేద పండి తులుగా, సిద్ధాంతులుగా, ఘనాపాఠీలుగా ఎంతోమంది దేశవ్యాప్తంగా ఖ్యాతి పొందారు.

సండే స్పెషల్

సాక్షి, భీమవరం/ ఇరగవరం: తణుకు నియోజకవర్గంలో మండల కేంద్రంగా ఉన్న ఇర గవరం జనాభా 5585 మం ది. కుటుంబాల సంఖ్య 1825. వీరిలో 250 వరకు బ్రాహ్మణ కుటుంబాల వారు ఉన్నారు. చాలా కుటుం బాల్లో వేదం, ఆగమనం, శాస్త్రం, జ్యోతిష్యం, స్మార్థం, మంత్ర శాస్త్రం తదితర కళలను అవపోసన పట్టి వేదపండితులు, ఘనాపాఠీలు, సిద్ధాంతులుగా ప్రసిద్ధి చెందినవారు ఉంటారు. తిరుమల తిరుపతి, విజయవాడ ఇంద్రకీలాద్రి, అన్నవరం సత్యనారా యణస్వామి, సింహాచలం అప్పన్న తదితర రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన ఎన్నో దేవాలయాలు, వేద పాఠశాలల్లోని ప్రముఖ వేద పండితుల్లో అధికంగా ఇరగవరం మూలాలు ఉన్నవారే ఉంటారని ప్రసిద్ధి. వేదాభివృద్ధికి చేసిన కృషికి సాంగత్రి వేదాచార్య, అహోరాత్రి పారాయణ, వేద తపస్వి, నిత్యాగ్నిహో త్రులుగా ప్రముఖుల నుంచి సత్కారాలు, పురస్కా రాలను, గండభేరుండాలను అందుకున్నవారు ఎం తోమంది ఉన్నారు.



ఇరగవరం గ్రామం, పంచపాలేశ్వర స్వామివారు (ఇన్‌సెట్‌లో)

ఎందరో మహానుభావులు...

వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణుడు సాక్షాత్తూ పర మేశ్వర స్వరూపంగా భావిస్తారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్న బ్రహ్మశ్రీ తంగి రాల బాలగంగాధరశాస్త్రి, దేశవ్యాప్తంగా అనేక చోట్ల అహోరాత్ర వేదపారాయణలు చేసిన బ్రహ్మశ్రీ గుళ్లపల్లి ఆంజనేయ ఘనాపాటి, యావత్ జీవితాన్ని వేదానికి అంకితం చేసిన గుళ్లపల్లి సీతా రామశాస్త్రి, నిత్యాగ్నిహోత్రకులుగా, పంచాంగకర్త లుగా పేరొందిన సోమయాజి, ప్రేసపాటి పాలశం కర అవధాని, సంస్కృతంలోని ఆరు గ్రంథాలను తెలుగులోకి అనువదించిన గుళ్లపల్లి శ్రీరామశర్మ, ప్రముఖ సిద్ధాంతిగా పేరొందిన పీసపాటి వెంకప్ప సోమయాజి తదితర ఎందరో వేద పండితులు ఈ గ్రామానికి చెందినవారే.

పంచపాల క్షేత్రం

పూర్వం బ్రాహ్మణులు ఇరగవరంలో నిత్యం యజ్ఞ యాగాది క్రతువులు చేసేవారు. వేద ప్రియుడైన ఈశ్వరుడు ఈ గ్రామానికి వచ్చి ఆకలితో పిల్లిగా మారి అక్కడి ఉట్టిలోని పాలు, పెరుగు, నెయ్యి ఆరగించేవారని చెబుతారు. పూజకు వినియోగిం చే ఈ ద్రవ్యాలు రోజూ మాయమైపోతుండటం చూసి గోసంరక్షకుణ్ణి కాపలాగా ఉంచారని, పిల్లి పాలు తాగుతుండటాన్ని గమనించి గొడ్డలితో కొట్టగా తల నాలుగు ముక్కలైందని, పిల్లి శరీ రాన్ని విడిచిన ఈశ్వరుడు వేదపండితులు, పెద్ద లకు కలలో ప్రత్యక్షమై పిల్లి శరీరం పడిన చోట ఉద్భవించిన శివలింగానికి ఆలయం నిర్మిం చాలని చెప్పాడని ఇక్కడ బహుళ ప్రాచుర్యంలో ఉంది. పాలగుండం, పాల వృక్షాల వనం, పాలరాతి శివలింగం, పాలబుడ్డి ఆకారంలో గుడి, పాలేశ్వరస్వామి వారి పేర్లతో పంచపాల క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పాలబుడ్డి ఆకారంలోని శివలిం గాన్ని యోగ లింగంగా చెబుతారు.



వేదపఠనం చేస్తున్న విద్యార్థులు



ఇరగవరంలో పూజలు నిర్వహిస్తున్న సినీ నటుడు శ్రీకాంత్ (ఫైల్)

పాలేశ్వరుడి అనుగ్రహంతోనే



పాలేశ్వర స్వామివారు కొలువై ఉన్న ఈ గ్రామంలో జన్మించడం పూర్వజన్మ సుకృ తం. స్వామి వారి అనుగ్రహంతోనే గ్రామం వేద నిలయంగా పేరొందిం ది. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల నుంచి సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక, వ్యాపార వేత్తలు ఎంతో మందికి జ్యోతిష్యం, వాస్తు సలహాలు చెప్పడం, ఆలయ నిర్మాణాలకు యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించే భాగ్యం కలగడం పరమేశ్వరానుగ్రహంగా భావిస్తాం.

– తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, శ్రీపంచముఖి హనుమద్ పీఠం, ఇరగవరం

గ్రామానికి చెందినవారు ఎందరో

తంగిరాల కృష్ణానందతిలక, తంగిరాల రామసోమ యాజులు, పీసపాటి సుబ్బరాయశాస్త్రిలు స్వాతం త్ర్య ఉద్యమంలో పాల్గొని తామ్రపత్రాలు పొందారు. వీరిలోని తంగిరాల రామసోమయాజులు 36 ఏళ్ల ఏకగ్రీవంగా గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. 1962లో అష్ట గ్రహ కూటమి వచ్చి అరిష్టాలు సంభ వించినప్పుడు ప్రముఖ మంత్రవేత్త తంగిరాల సుబ్ర హ్మణ్య సిద్ధాంతి, తంగిరాల బాలగంగాధర శాస్త్రి, పేసపాటి వెంకప్ప సోమయాజి సిద్ధాంతి తదిత రులు దేశ క్షేమం కోసం 12 రోజులు స్వామివారికి అతిరుద్ర యాగం నిర్వహించినట్టుగా పెద్దలు చెబు తారు. ప్రస్తుత తరంలోనూ గ్రామానికి చెందిన ఎం దరో వేదపండితులు పెద్దలు చూపిన మార్గంలో నడుచుకుంటూ దేశవ్యాప్తంగా జ్యోతిష్య, వాస్తు విష యాలపై ప్రజలకు పరిష్కార మార్గాలను చూపుతూ వేదాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సినీ, రాజకీయ ప్రముఖులు ఎందరో ఇక్కడికి వచ్చి పూజలు చేయిం చుకుంటుంటారు. బ్రహ్మశ్రీ గుళ్లపల్లి సీతారామశాస్త్రి కుటుంబ సభ్యులు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ కామకోటి చంద్రశేఖర వేద పాఠశాల ద్వారా ఎంతో మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు.

నేడు సచివాలయ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు

ఏలూరు (టూటౌన్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఉమ్మడి ప్రయో జనాల కోసం, హక్కుల సాధన కోసం గత నెల 8న ప్రభుత్వానికి ముందస్తు సమాచారం అందించినా.. ఎలాంటి స్పందన రాకపోవడంతో దశల వారీగా ఉద్యోగులు వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాం తీయ సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సచి వాలయ ఉద్యోగుల జేఏసీ నిర్ణయం మేరకు నిర్వహి స్తున్న ఈ సదస్సు విజయవంతం చేసేందుకు తరలి రావాలని జేఏసీ నాయకులు కోరారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు

వివాహేతర సంబంధమే కారణమని నిర్ధారణ



తణుకులో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్, చిత్రంలో నిందితులు

తణుకు అర్బన్: తణుకులో యువకుడి అదృశ్యం ఆపై హత్య కేసును పోలీసులు ఛేదించారు. పక్కా ప్లాన్ ప్రకారమే తాడేపల్లిగూడెంకు చెందిన మాదు గుల సురేష్ (25)ను హత్యచేసినట్లుగా పోలీసులు నిర్ధారించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. న్యాయవాది తిర్రే సత్యనా రాయణరాజు భార్య శిరీషతో మృతుడు సురేష్‌కు ఉన్న వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగిందని, న్యాయవాది సత్యనారాయణరాజు మరో నలుగురి సాయంతో హత్య చేసినట్లుగా విచా రణలో తేలిందని వివరించారు. తన భార్యతో సం బంధంపై సురేష్‌ను పలుమార్లు హెచ్చరించినప్ప టికీ మార్పు రాకపోవడంతోనే హత్యకు పాల్పడిన ట్లుగా సత్యనారాయణరాజు ఒప్పుకున్నట్లు చెప్పారు. ఈ నెల 23న తన తమ్ముడు సురేష్ తణుకు వచ్చాడని తిరిగి తాడేపల్లిగూడెం రాలేదని అతని సోదరి ముచ్చె ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగం గా హత్యగా బయటపడినట్లు వివరించారు. శిరీషను కలిసేందుకు తణుకు వచ్చిన సురేష్‌పై నిందితులు దాడి అనంతరం శవాన్ని గోనెసంచిలో కుక్కి తణుకు నుంచి కారులో తీసుకెళ్లి చించినాడ వద్ద గోదావరిలో పారేసినట్లుగా విచారణలో తేలిందన్నారు. మృతదే హాన్ని సఖినేటిపల్లి సమీపంలోని రామేశ్వరం పరి ధిలో గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 30 మందికి పైగా సాక్షులను విచారించారు. ఈ ఘటనలో ఇప్ప టివరకు నిందితులు ఉపయోగించిన కియా సెల్టాస్ కారుతోపాటు మరో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, కేసు లోతుగా దర్యాప్తు చేసి మరెవరి ప్రమేయమైనా ఉందా అని తేల్చుతామ న్నారు. ఈ కేసులో సత్యనారాయణరాజుతో పాటు వల్లూరి పండుబాబు, సరెళ్ల సాయి కృష్ణ, బంటు ఉదయ కిరణ్, గంటా ఫణీంద్ర బాబు, తిర్రే శిరీషలను అరెస్టు చేశారు. వీరికి శనివారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. మృతదేహాన్ని తరలించేం దుకు వినియోగించిన కారు యజమాని, నిందితుడి సోదరుడు తిర్రే విజయకృష్ణను ఏ7గా చేర్చామని ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారని చెప్పారు. కేసు దర్యాప్తులో పట్టణ సీఐ ఎన్.కొండయ్య, రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, అత్తిలి ఎస్సై ప్రేమ్‌కుమార్, పట్టణ ఎస్సై కె.ప్రసాద్, ఏఎస్సైలు పి.సంగీత్‌రావు, పి.సత్య నారాయణ, ఎస్.శ్రీధర్‌తోపాటు 11 మంది కానిస్టే బుళ్ల చొరవను డీఎస్పీ ప్రశంసించారు.

7 నుంచి బాలబాలికలకు క్రీడా పోటీలు

పెదవేగి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–19 విభాగంలో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతున్నాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జ యరాజు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ తీసుకుని హాజరు కావా ల్సిందిగా ఆయన కోరారు. ఈ నెల 7న తణుకు ఎస్‌కేఎస్‌బీ మహిళా కళా శాలలో బాలికలకు చెస్, కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగాసన, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 8న పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకులంలో బాలురకు చెస్, కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగాసన, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ నిర్వహిస్తామని జయరాజు తెలిపారు. ఈ నెల 14న బాల బాలికలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో బాస్కెట్‌బాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తా మని, ఈ నెల 15న పెదవేగి బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల్లో హ్యాం డ్‌బాల్, హాకీ, క్యారమ్స్, రోల్‌బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

24 గంటల్లో నిందితుడి పట్టివేత

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కాగుపాడు శివారుల్లో మంగళ సూత్రం తెంపుకుపోయిన యువకుడిని 24 గంటలు తిరగకముందే అరెస్టు చేశారు. కాగుపాడు బస్టాండు వద్ద శుక్రవారం ఉదయం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని మహిళ లిఫ్ట్ అడగింది. నాచుగుంట వంతెన వద్ద దింపుతానని చెప్పి ఊరి దాటాక మెడలో మంగళసూత్రం బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేశారు. చోరీ చేసిన వ్యక్తి దళితవాడలో ఉంటున్న కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నీమకల్‌కు చెందిన వీరేష్ జాన్‌పాల్‌గా గుర్తించారు. అతనిని కైకరం వద్ద పట్టుకని బంగారు తాడును స్వాధీనం చేసుకున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: చేనేత పరిశ్రమను విస్మరించి, పవర్ మగ్గాల యాజ మాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కూటమి తీరు గర్హనీయమని వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ చేనేత విభాగం కార్యదర్శి రాపోలు భావ నారుషి అన్నారు. నాలుగు నెలలుగా ఆప్కో ఉద్యోగులకు జీతాలు ఇవ్వ లేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 250 ఉద్యోగ కుటుంబాలు దసరా సమయంలో పస్తులు ఉండాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వం కలి ్పంచిందన్నారు. ఆప్కో ఉద్యోగులకు నెలకు రూ.50 లక్షల జీతాలు కూడా ఇవ్వలేకపోవడం దారుణంగా ఉందన్నారు. ఆప్కో ఉద్యోగుల నాలుగు నెలల జీతాల బకాయిలను చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ హెచ్‌సీ ఎండీ. జిలాని తెలిపారు. అత్తిలికి చెందిన బాలిక (14) గత నెల 29న తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. మూడ్రోజులు పాటు బంధువులతో గడిపింది. శుక్రవారం సాయంత్రం వారు ఏపీ నిట్ వద్ద హైదరాబాద్ బస్సులో బయల్దేరారు. అనంతరం బాలిక అత్తిలి వెళ్తున్నట్లు చెప్పింది. అయితే, స్వగ్రామం అత్తిలి చేరుకోకపోవడంతో బంధువుల ఇంటి వద్ద గాలించారు. ఆచూకీ కానరాకపో వడంతో శనివారం తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాకట్టు బంగారం మాయంపై ఫిర్యాదు

నూజివీడు: బంగారంపై రుణాలు ఇచ్చే మణప్పురం కంపెనీలో తాకట్టు పెట్టిన బంగారం కోసం 20 రోజులుగా తిరుగుతున్నా తన బంగారం పోయిం దని కంపెనీ ఉద్యోగులు చెబుతున్నారని ఆగిరిపల్లికి చెందిన అబ్బదాసరి శ్రీను వాపోయాడు. స్థానిక మణప్పురం బ్రాంచి వద్ద ఆయన శనివారం మాట్లాడుతూ సంవత్సరం క్రితం తన దగ్గర ఉన్న 12 గ్రాముల బంగారం తాకట్టు పెట్టి నెలనెలా వాయిదాలు చెల్లించానని చెప్పాడు. తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు 20 రోజుల క్రితం బ్రాంచి వద్దకు వస్తే మీ బంగారం లేదని, గతంలో పనిచేసిన మేనేజర్ బంగారం, డబ్బుతో పారిపో యాడని, అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారన్నారు. సం స్థపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని బాధితుడు పేర్కొన్నాడు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం, పూళ్ల మధ్య ప్రైవేటు బస్సు శనివారం కర్రల లోడు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముం దు అద్దాలు పగిలాయి. ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న ట్రావెల్ బస్సు కురెళ్ల గూడెం, పూళ్ల గ్రామాల మధ్య వద్దకు వచ్చే సరికి లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 46 మంది ప్రయాణిస్తున్నారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

చిన్నతిరుపతి క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో పోటెత్తిన ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ప్రాంతంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ దసరా సెలవులు ముగియడంతో ఊళ్లకు వెళ్తున్న వారు, విజయవాడ దుర్గమ్మ ఆలయం లో ఇరుముడులు సమర్పించిన భవానీ భక్తులు వేలా దిగా ఆలయానికి తరలివచ్చారు. దాంతో తెల్లవారు జాము నుంచి ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిట లాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణ కట్ట, అన్నదాన విభాగాల వద్ద భక్తులు పోటెత్తారు. కొం డపై, అలాగే కొండ కింద గుడి సెంటర్‌లో ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు. రాత్రి వరకు ఆలయం లో భక్తుల రద్దీ కొనసాగింది. పలు భజనల మండలి సభ్యులు అనివేటి మండపంలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

చంద్రబాబు దళిత ద్రోహి



ఆచంటలో అంబేడ్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పెనుగొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని ఆచంట నియోజ కవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిల్లి రుద్ర ప్రసాద్ విమర్శించారు. చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆచంటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సా ర్‌సీపీ సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంపై టీడీపీ మొదటి నుంచి విషం జిమ్ము తుందని అన్నారు. సీఎం సొంత జిల్లాలోనే ఇలాం టి దురగతం జరగడం బాధాకరమన్నారు. ఘటనకు కారణమైన టీడీపీ నేత సతీష్ నాయుడు పై అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సా ర్‌సీపీ నాయకులు తప్పెట్ల వెంకట్రావు, చదలవాడ ఆనంద్, పీతల అంబేడ్కర్, చదలవాడ ముత్యాల రావు, కొంబోత్తుల దుర్గా ప్రసాద్, పుచ్చకాయల నాగార్జున, వడ్లపాటి అంబేడ్కర్, కోట గిరిధర్, పుచ్చకాయల భీమారావు, వడ్లపాటి నవీన్, వేమన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మినుము సాగు చేసేలా ప్రోత్సహించాలి

పెనుమంట్ర: ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం లో ఇన్‌చార్జ్ సహసంచాలకుడు డాక్టర్ బి సహదే వరెడ్డి అధ్యక్షతన నెలవారీ శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లా డుతూ తాడేపల్లిగూడెం డివిజన్‌లో వరి తర్వాత సుమారు 5 వేల ఎకరాల్లో మినుము సాగు చేసేలా ఆయా ప్రాంత రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త (వరి) డాక్టర్ ఎం .గిరిజా రాణి, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం చెందిన శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

6న క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 6న ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అండర్–14, అండర్–17 బాల బాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిం చనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే.అలివేలు మంగ ఒక ప్రకటనలో తెలిపారు. తైక్వాండో ఎంపిక పోటీలు, బాల బాలికల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గం టల నుంచి జరుగుతుందన్నారు. అండర్ 14 జట్లకు వచ్చే విద్యార్థులు 2012 జనవరి 1న కానీ ఆ తరువాత కానీ పుట్టి ఉండాలన్నారు. అండర్ 17 జట్ల ఎంపికకు వచ్చే విద్యార్థులు 2009 జనవరి 1న కానీ ఆ తరువాత గానీ పుట్టి ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 9030894311, 81433096604 నెంబర్లలో సం ప్రదించవచ్చన్నారు.

స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

వీరవాసరం: జిల్లా విద్యా శాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగో దావరి జిల్లా అండర్ 14, అండర్ 17 బాలబా లికల విభాగాల్లో టేబుల్ టెన్నిస్, మాల్కంబ్ ఎంపికలు ఈ నెల 7న భీమవరం చింతలపాటి బాపిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, ఫెన్సింగ్ ఎంపికలు మద్దాల రామకృష్ణమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాల వీరవాసరంలో, లాన్ టెన్నిస్ ఎంపికలు పాలకొల్లు టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యద ర్శులు డి.సునీత, పీఎస్ఎన్ మల్లేశ్వరరావు పత్రిక ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివ రాలకు 91002 85197, 8074153923 నెంబ ర్లలో సంప్రదించాలన్నారు.

సౌండ్ తగ్గించమన్నందుకు దాడి

కైకలూరు: గోపవరం దళితవాడలో ఇరువర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ జరిగింది. సౌండ్ తగ్గించాలని బండి శివకృష్ణ కోరగా.. కాగితాల వెంకీ, అతని తండ్రి రాంబాబు, కాగితాల సు దీర్, శ్యామ్, వాణి, బన్నీ, చందులు శివకృష్ణపై దాడి చేశారు. ఆ సమయంలో అడ్డువచ్చిన గద్దె వినోద్‌కుమార్, కాలే వంశీలను కొట్టారు. శివకృ ష్ణ బావమరిదిపైనా దాడికి పాల్పడ్డారు. కైకలూరు టౌన్ పోలీసులు శివకృష్ణ ఫిర్యాదుతో దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: ఈదూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం జరిపారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో పీవీవీ రాంప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పెంటపాడు: పెంటపాడు ఎంపీడీవోగా పీవీవీ రాంప్రసాద్ నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ రెండు నెలల క్రితం పదవీవిరమణ చేయడంతో ఆయన స్థానంలో మండల కార్యాలయ సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కాగా తణుకు మండల కార్యాలయ ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న రాంప్రసాద్ పదోన్నతిపై పెంటపాడు విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంటపాడు మండల అధికారుల సమన్వయంతో మండలంలోని అన్ని గ్రామాలు పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, ప్రత్తిపాడు, పెంటపాడు, పరిమెళ్ల గ్రామ కార్యదర్శులు జవ్వాది నాగేశ్వరరావు, గోడి బాలకృష్ణ, నాగదేవి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా రమేష్



బోనగిరి రమేష్

తాడేపల్లిగూడెం రూరల్: ఆర్యవైశ్య సంఘం తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడిగా బోనగిరి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మోదుగగుంట గ్రామంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్యవైశ్య సంఘ నాయకులు సమయమంతుల వైకుంఠం, చిట్టూరి కాశి విశ్వనాథం, గమిడి మల్లిబాబు, చలంచర్ల మురళీమోహన్, ముత్తా శ్రీనివాస్, కామిశెట్టి కాశి విశ్వనాథం, కుసుమంచి వెంకటేశ్వరరావు, బోనగిరి రామదాసు, చిట్టూరి సుబ్రహ్మణ్యం, సమయంతుల వెంకటకృష్ణారావు తదితరులు అభినందించారు.

'గూడెం' ఎంపీడీవోగా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉంగుటూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన ఎం.వెంకటేష్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కు మండల పరిషత్ ఏవో సుజాత, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయండి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైల్వేస్టేషన్‌లో శనివారం స్టేషన్ మేనేజర్ ఎస్.వెంకట్రావును కలిసి రైల్వేస్టేషన్‌లో ఉన్న వివిధ ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రజలకు వీలుగా అందరికి అందుబాటులో ఉండే విధంగా నాల్గోవ ప్లాట్‌ఫారంను ఏర్పాటు చేయాలని, ఏలూరు కాలువ మీదుగా బ్రిడ్జి ఏర్పాటు, రైల్వే లాజిస్టిక్స్‌ను నవాబ్‌పాలెం తరలించాలని, తదితర సమస్యలను విన్నవించారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

వేతనాలందక పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు

- 3 నెలల వేతనాల పెండింగ్
- 4 నెలల పెండింగ్‌కి ఒక్క నెల వేతనమే దిక్కు
- కూటమి ప్రభుత్వంలో రెండు సమ్మె నోటీసులు
- ఆకలితో అలమటిస్తున్నామంటున్న కార్మికులు



తణుకులో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన భీమారావు, కార్మికులు (ఫైల్)

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లోని పారిశుద్ధ్య నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న కార్మికులు వేతనాలు అందక ఆకలికేకలతో అల్లాడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారి రక్షణకు నిఖార్సుగా అందుతున్న సేవలు అల్లాడుతున్నాయి. ఆస్పత్రిలో మరుగుదొడ్లు నిర్వహణతోపాటు ఆవరణ, ఆపరేషన్ థియేటర్‌ల క్లీనింగ్, వ్యర్థాల తొలగింపులో కార్మికులు అందిస్తున్న సేవలు అజరామజరంగా నిలుస్తున్నా కూటమి ప్రభుత్వం మూడు పూటలా కడుపునిండా నాలుగు మెతుకులు మనస్ఫూర్తిగా తినే అవకాశం ఇవ్వడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే చాలీచాలని వేతనాలు అవి కూడా ఏనెల వేతనం ఆనెల అందడం లేదంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 150 బెడ్‌లతో వైద్యసేవలందిస్తున్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిత్యం 600లకు పైగా ఓపీ నమోదవుతుండగా నేడు 15 మంది కార్మికులు విధుల్లో ఉండి సేవలందిస్తున్నారు. వేతనాలతో పాటు 40 నెలల పీఎఫ్ బకాయిలు కూడా ఉండిపోయాయని చెబుతున్నారు. వేతనాల కోసం కార్మికులు యూనియన్ నాయకులతో కలిసి ఎన్ని నిరసనలు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50 బెడ్‌లు ఉన్నప్పటి నుంచి 18 మంది కార్మికులం ఉన్నామని కానీ నేడు 200 బెడ్‌లకు అప్‌గ్రేడ్ అయి భవన విస్తరణ పెరిగినా అదే సంఖ్యతో పనిచేస్తూ అనారోగ్యాల బారిన పడిపోతున్నామని మండిపడుతున్నారు.

3 నెలల పెండింగ్‌లో వేతనాలు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు 3 నెలల వేతనాల పెండింగ్‌తో అల్లాడుతున్నారు. గతనెల 27వ తేదీన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కు యూనియన్ తరఫున 29వ తేదీ నుంచి 4నెలల వేతనాల పెండింగ్‌తో సమ్మె నోటీసు ఇచ్చారు. పూర్తి వేతనాలు చెల్లిస్తామని వైద్యాధికారుల హామీతో సమ్మె వాయిదా వేయగా అయితే ఈనెల 2వ తేదీన మళ్లీ ఒక నెల వేతనం మాత్రమే వేశారని కార్మికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి 4 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని సమ్మె నోటీసు ఇస్తుంటే ఒక నెల వేతనం వేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. సమ్మెకు దిగుతామని చెప్పగానే అధికారులు ఆస్పత్రికి వచ్చి మభ్యపెడుతున్నారని మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతుందంటూ వాపోతున్నారు. జీతం రాకపోయినా ఖర్చులు తప్పవు కదా అనే ఉద్దేశ్యంతో ఇళ్లు గడిపేందుకు అప్పులు చేస్తున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి తింటున్నారు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పని సరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులకు వేతనాలు సక్రమంగా ఇస్తూ కార్మికులకు మాత్రమే వేతనాలు పెండింగ్ పెట్టడం చాలా దుర్మార్గం. ఇచ్చే జీతాలు సరిపోకపోయినా ఏదైనా మంచి రోజులు వస్తాయేమోననే ఆశతో కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులను పస్తులు పెట్టేలా ప్రభుత్వం తీరు కనిపిస్తోంది. కార్మికుల ఆకలికేకలతో పొట్టపట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

మానసిక సమస్యలపై అవగాహన



తణుకులో అవగాహన కార్యక్రమంలో డాక్టర్ కుదారి ఆనంద్ తదితరులు

తణుకు అర్బన్: నేటి సమాజంలో మానసిక సమస్యలు మానవాళిని వేధిస్తున్నాయని లయన్, మానసిక వైద్యులు డాక్టర్ కుదారి ఆనంద్ అన్నారు. వరల్డ్ వైడ్ సర్వీస్ వీక్‌లో భాగంగా లయన్స్ జిల్లా 316 జీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లిటిల్ ప్యారడైజ్ స్కూల్‌లో నిర్వహించిన మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఒత్తిడితో కూడిన రోజుల్లో విద్యార్థుల్లో సైతం చిన్న వయస్సులోనే మానసిక స్థితి బాగుండడం లేదని స్పష్టం చేశారు. జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్ లయన్స్ వంక రాజకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఫాస్ట్ గవర్నర్ పీడీజీ లయన్ మాదిరెడ్డి బాబూజీరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దామెర రంగారావు, ఫ్యామిలీ కౌన్సిలర్ కుదారి ఆనంద్, తణుకు ప్రాంతంలోని 8 లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ప్రతి కార్యకర్తకూ కొండంత అండ



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ



అత్తిలిలో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్, వేధింపులుకు గురైన ప్రతి కార్యకర్తకూ కొండంత అండ అని వైఎస్సార్ సీపీ పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. మండలపార్టీ కార్యాలయంలో మండల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలును ఉద్దేశ పూర్వకంగా వేధింపులకు గురి చేస్తే తక్షణమే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, తద్వారా వారిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టె అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా క్యూర్‌కోడ్‌తో కూడిన డిజిటల్ బుక్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బుద్దరాతి భరణీ ప్రసాద్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేతనాగరాజు, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, రంభ సూరిబాబు, సబ్బితి రాజేష్, కునాధరాజు శ్రీహరిరాజు, కాకర్ల విశాలాక్షి, కంకటాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

10న ఉచిత మెగా వైద్య శిబిరం

తణుకు అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన స్థానిక వీకే ఫంక్షన్ హాల్‌లో రాజమండ్రి జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ హాస్పటల్ వైద్య బృందంచే మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకటకృష్ణ, జి.సుధాకర్ తెలిపారు. జీఎస్ఎల్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తమ వైద్య బృందంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యసేవలు అందిస్తారని వివరించారు. ఈ శిబిరంలో 40 సంవత్సరాలు పైబడిన పురుషులకు రెండు రకాల పరీక్షలు, మహిళలకు నాలుగు రకాల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి దాతగా వ్యవహరించనున్న మల్లిన అరుణసారధి జన్మదినాన్ని పురస్కరించుకుని వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

6 నుంచి మీనవిల్లూరులో ఆశీర్వాద పండుగలు

పెంటపాడు: ఈనెల 6 నుంచి మూడు రోజులపాటు మీనవిల్లూరు పాస్టర్ కృష్ణ చర్చిగ్రౌండ్‌లో ఉపవాస ఆశీర్వాద పండుగలు నిర్వహించన్నుట్లు యుపీఏ పెంటపాడు మండల అధ్యక్షుడు డీఆర్కే మోజస్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ కాపరి పాస్టర్ మహేష్‌పాల్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం, సాయత్రం నిర్వహించబోయే ఈ సమావేశాలకు గుడివాడకు చెందిన డబ్ల్యూ సీఎం దైవజనులు కిరణ్‌పాల్, భీమవరం మన్నా చర్చికి చెందిన సీనియర్ దైవజనులు బిషప్ ఎం. దేవదాస్, పాలచర్లకు చెందిన బ్రదర్ గ్రేస్ విక్టర్, ఆరేడుకు చెందిన దైవజనులు పాలా ఆశీర్వాదం, బ్రాహ్మణగూడెంకు చెందిన ఎం రాజేశ్వరరావు తదతరులు దేవుని వాక్యం అందిస్తారన్నారు. ఈ సమావేశాలను పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ఘనంగా బలుసులమ్మ అమ్మవారి తెప్పోత్సవం





బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద కోనేరులో తెప్పోత్సవం, విశేష అలంకరణలో వాసవి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి దసరా మహోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలోని కోనేరులో తెప్పోత్సవం ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు.

వాసవి మాతకు ప్రత్యేక పూజలు

స్థానిక వాసవి కన్యకపరమే శ్వరీ ఆలయంలోని వాసవి మాతకు శనివారం పూర్ణాహుతి, అభిషేకాలు, 108 వెండి కలశములతో, 108సువాసినిలతో విశేషపూజలు జరిగాయి. అమ్మవారికి పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో, పసుపు, కుంకుమలతో అభిషేకాలు నిర్వహించారు. పూలంగి సేవ జరిగింది. అన్న ప్రసాదాలు అందించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలను ఆదరించాలి



దివ్యాంగులకు ఇంటి వద్దే ప్రత్యేక విద్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు భవిత సెంటర్ ఆధ్వర్యంలో ఇంటి వద్దనే ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలోని అతి తీవ్రత వైకల్యం ఉన్న భవిత పిల్లలకు శనివారం ఇంటి వద్దకు వెళ్లి ప్రత్యేక శిక్షణ, ఫిజియోథెరపీలు నిర్వహించారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు అందించే ఉపకరణాలు, బోధన సామగ్రి తదితర విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సమాజంలో నార్మల్ పిల్లలతో సమానంగా దివ్యాంగులు పిల్లలను గౌరవించాలని, వారి విద్య అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం



యోగా సెంటర్‌లో మానసిక ఆరోగ్యంపై యోగా

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని పేరిచర్ల ఫౌండేషన్ నిర్వాహకులు మురళీకృష్ణంరాజు, లయన్స్ గట్టిం ప్రవీణ్ కృష్ణలు అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్, కైండ్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్యవతి నగర్‌లోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో లయన్స్‌క్లబ్ పిలుపు మేరకు యోగా కార్యక్రమాలు జరిగాయి. ఆరా ఫౌండేషన్ ఫౌండర్ కరిబండి రామకృష్ణ యోగా విశిష్టతను వెల్లడించారు. ప్రాణాయామం, ధ్యానం, యోగా కార్యక్రమాలు జరిగాయి. అదే విధంగా స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో నిర్వాహకులు బడుగు చంద్రశేఖర్‌చే మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. మద్దుకూరి మెహర్ ప్రసాద్, గ్రంధి అపర్ణ ప్రసాద్, వివిధ క్లబ్ సభ్యులు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు వై. జంక్షన్

పెంటపాడు: పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత రెండు రోజుల నుంచి గీష్మతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. శీతాకాలంలో ఇదేమి తీవ్రమైన ఎండరా బాబూ అంటూ ప్రజలు విస్మయచెందుతున్నారు. మే నెలలో ఉన్న వేసవిలా వాతావరణం తలపిస్తోంది. ఇంకా రానున్న రోజులు ఎలా గడపాలో, ఏ విధంగా ఉండాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు రాత్రి సమయాలలో దోమల బెడద కూడా అధికంగా ఉంది. తీవ్ర మైన ఎండలో దోమలు ఉండే చాన్స్ లేదు. ఉదయం 8 దాటితే చాలు ఎండ ప్రతాపం కనిపిస్తోంది. దసరా సెలవులు అనంతరం స్కూలు తెరుస్తున్న తరుణంలో ఈ ఎండకు విద్యార్థులు భయపడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు ఉన్నాయి. వారంలో నాలుగురోజులు ఎండ, మూడు రోజులు వర్షం అన్నట్లు ఉంది.

నేటి తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ క్యాంపులు

తాడేపల్లిగూడెం: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు తపాలాశాఖ తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు సూపరింటెండెంటు అల్లు సురేష్ కుమార్ శనివారం తెలిపారు. అక్టోబరు 8 నుంచి 14వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడేపల్లిగూడెంలో ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో, నిడదవోలు ఉన్నతపాఠశాలలో పది నుంచి 11 తేదీల్లో, 13 నుంచి 14 వరకు పోలవరం ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు, అప్‌డేట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేట్‌సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అప్‌డేట్‌లకోసం సంవత్సరంపాటు యుఐడీఏఐ రుసుములను మినహాయించిందన్నారు. పోస్టుఆఫీస్ బ్యాంకు ఖాతాలు, సుకన్య సమృద్ధి యోజన, మగపిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంటు ఫండ్ ఖాతాలను తెరచుకొనే వెసులుబాటు కల్పించామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వై. జంక్షన్ దుర్గమ్మ గ్రామోత్సవం

పెంటపాడు: దసరా ముగింపు పురస్కరించుకొని ప్రత్తిపాడు వై. జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఈవో జవ్వాది కృష్ణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్తిపాడు, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఈ ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నిమజ్జనాలకు బయల్దేరిన దుర్గమ్మ విగ్రహాలు



కనకదుర్గమ్మ అమ్మవారు



ఊరేగింపులో విద్యుత్ లైట్లు



పట్టణంలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



విప్పర్రు గ్రామంలో ట్రాక్టర్‌పై కనకదుర్గమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో పసర్ల చెరువు, గాయత్రి గుడి, 5వ వార్డు, 17వ వార్డులోనూ అమ్మవార్ల విగ్రహాలను నిమజ్జనాలకు శనివారం తరలించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలను పట్టణ పురవీధుల్లో కాళికా వేషాలు, తీన్మార్ డప్పులు, బాణాసంచా కాల్పుల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం గోదావరి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అమ్మవార్ల ఊరేగింపు ఉత్సవాలు

పెంటపాడు: దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని పలు గ్రామాల్లో శనివారం కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు, వీడ్కోలు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పడమర విప్పర్రు గ్రామంలో శనివారం స్థానిక వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి భారీ గ్రామోత్సవం నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, ఆసాదుల నృత్యాలు, బాణసంచా, పలు ప్రచార సామగ్రితో అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బోణం వీరయ్య ఆధ్వర్యంలో ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెంటపాడులో వర్తకసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మ అమ్మవారిని గ్రామ వీధుల్లో శనివారం రాత్రి పొద్దుపోయేవరకు ఊరేగించారు. ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా పాతూరు కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు ముగింపు సందర్భంగా పట్టణంలోని పాతూరు కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. ఆలయం వద్ద నుంచి గరగ నృత్యాలతో, తీన్‌మార్ డప్పులతో, గొడుగు ఆకారాల విద్యుత్ లైట్లతో, బాణాసంచాలతో ఘనంగా సాగింది. పట్టణంలో ఊరేగించారు. పాతూరు యూత్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి నిమజ్జనోత్సవం జరిగింది.